అధికారికంగా 'విమోచనం'పై హర్షం

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : ఇకపై ఏటా సెప్టెంబర్ 17న కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించడంపపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షాకు బుధవారం ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ స్వాతంత్ర్యం కోసం త్యాగం చేసిన మహనీయులందరికీ సరైన గౌరవం దక్కిందని అభిప్రాయపడ్డారు. కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయడంపపై మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు కూడా హర్షం వ్యక్తం చేశారు.

విమోచనం కాదు..విలీనమే

సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. హైదరాబాద్ రాజ్యాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేస్తూ సెప్టెంబర్ 17న నిజాం రాజు సంతకం చేశారని, కాబట్టి ఇది విలీనమైన రోజు అని, విమోచన దినం కాదని స్పష్టం చేశారు. కేంద్రం నిర్ణయం చరిత్రను వక్రీకరించడమేనని, కేంద్రం తన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంజేపీ గురుకుల కార్యదర్శిగా సైదులు బాధ్యతలు

హైదరాబాద్, మార్చి13 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శిగా ఐఎఫ్ఎస్ అధికారి సైదులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని సొసైటీ కార్యాలయంలోని సిబ్బందితో సమావేశమయ్యారు. గురుకుల విద్యాసంస్థల పనితీరు గురించి పూర్వ కార్యదర్శి మల్లయ్యభట్టు ఈ సందర్భంగా వివరించారు. నాగార్జునసాగర్‌లోని బీసీ గురుకుల విద్యాలయంలో చదువుకొని ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన సైదులు గతంలో అటవీశాఖలో, సుదీర్ఘ కాలం పాటు గ్రామీణాభివృద్ధి శాఖల్లో విధులు నిర్వర్తించారు. ఎంజేపీ సొసైటీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సైదులుకు సొసైటీ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

18 నుంచి ఏఈఈ ఉద్యోగాలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాలలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) ఉద్యోగాల భర్తీకి ఈ నెల 18 నుంచి 22 వరకు జేఎన్టీయూ కూకట్‌పల్లిలోని అడ్మిషన్ బ్లాక్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ తెలిపారు. ఏఈఈ అభ్యర్థుల షార్ట్ లిస్టు జాబితా టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు వెల్లడించారు.

హైదరాబాద్‌లో నేడు, రేపు జర్నలిస్టులకు శిక్షణ

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): పర్యావరణ మార్పులపై జర్నలిస్టులకు అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. యూఎస్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్, వ్యూస్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌నకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం సహకారం అందించనున్నది.బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో ఈ శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ పాల్గొననున్నారు. ఈ శిబిరంలో తెలంగాణతోపాటు ఒడిశా, ఏపీకి చెందిన జర్నలిస్టులు పాల్గొంటారని, వారికి సీనియర్ పాత్రికేయులు, నిపుణులు శిక్షణ ఇస్తారని వ్యూస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భీమారావు తెలిపారు.

నేడు ఉద్యోగ సంఘాలతో క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : జీవో -317 సమస్యలపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన క్యాబినెట్ సబ్‌కమిటీ గురువారం సాయంత్రం ఉద్యోగ సంఘాల నేతలతో భేటీ కానున్నది. మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుతో కూడిన కమిటీ సచివాలయంలో సమావేశంకానున్నది. దీనికి అన్ని శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు హాజరుకావాలని జీఏడీ సెక్రటరీ కే నిర్మల ఆదేశించారు.

డీఏ ఆశలు ఢమాల్!

- పెండింగ్ డీఏలకు లభించని మోక్షం
- క్యాబినెట్‌లో నిర్ణయం ఉంటుందన్న సీఎం
- ఆ ఊసేలేకుండా ముగిసిన క్యాబినెట్
- అసంతృప్తిలో ఉద్యోగులు, పెన్షనర్లు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): డీఏ ప్రకటిస్తారని ఆశగా ఎదురుచూస్తున్న ఉద్యోగవర్గంపై ప్రభుత్వం మరోమారు నీళ్లు కుమ్మరించింది. పెండింగ్ డీఏల్లో కనీసం ఒక్కట్టైనా ఇస్తారని ఉద్యోగులు భావించినా, ఆ ఊసు లేకుండానే క్యాబినెట్ సమావేశం ముగిసింది. డీఏపై ప్రభుత్వ వర్గాల నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఉద్యోగుల్లో నైరాశ్యం నెలకొన్నది. రేపో, మాపో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉండడంతో డీఏపై ఆశలు ఇక లేనట్టే. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం మొత్తంగా నాలుగు డీఏలు బాకీపడింది. ఉద్యోగులతో ఇటీవల నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పెండింగ్ డీఏలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు. అన్నీ ఒకేసారి అంటే కుదరదని, క్యాబినెట్‌లో చర్చించి ఒక్కొక్కటిగా మంజూరు చేస్తామని చెప్పారు. సీఎం చెప్పడంతో మంగళవారం నాటి క్యాబినెట్ భేటీలో రెండు డీఏలను మంజూరు చేస్తారని, కనీసం ఒకదానికైనా మోక్షం లభిస్తుందని ఆశలు పెట్టుకున్నారు. క్యాబినెట్ భేటీ మాత్రం డీఏ విషయాన్ని ప్రస్తావించకపోవడంతో ఉద్యోగులు అసంతృప్తికి గురయ్యారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగులో ఉన్న మూడు డీఏలను మంజూరుచేస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేర్కొంది.

మొత్తం బాకీ 5,400 కోట్లు

రాష్ట్రంలో మొత్తం 3,69,200 మంది రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులున్నారు. 2,88,000 మంది పెన్షనర్లు ఉన్నారు. వీరికి ఈ జనవరితో కలుపుకొంటే రాష్ట్ర ప్రభుత్వం మొత్తం నాలుగు డీఏలు బాకీపడింది. 2024 జనవరి డీఏను పీఆర్సీలో కలుపుకొని ఇస్తారని అనుకుంటే, దీనిని మినహాయిస్తే పెండింగ్‌లోని మూడు డీఏల మొత్తం రూ.5,400 కోట్లు ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షనర్లకు బాకీ పడింది. వీటిలో డీఏ సహా గత ఎరియర్స్ కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఒక డీఏ చెల్లించేందుకు రూ. 1800 కోట్లు అవుతుందని ప్రభుత్వ వర్గాలు అంచనా. ఇంత మొత్తం ఒకేసారి ఇవ్వడం సాధ్యం కాదన్న భావనతోనే కేబినెట్ డీఏల జోలికి వెళ్లలేదని సమాచారం. డీఏలకు బదులుగా రైతుభరోసా ఇచ్చేందుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది.

పెండింగ్ డీఏల వివరాలు

జూలై 2022	3.64%
జనవరి 2023	3.64%
జూలై 2023	3.64%
జనవరి 2024	3.64%

సోషల్ మీడియాలో కామెంట్లు

- పాల ప్యాకెట్లు మిగిలాయి. డీఏ ఇస్తే రాష్ట్రంలో పాలకొరత తలెత్తేది.
- సీఎంతో ఆత్మీయ సమ్మేళనానికి 76 సంఘాలను పిలిచారు. ఇప్పుడు డీఏ ఇవ్వకపోయినా ఒక్క నాయకుడు చప్పుడు చేస్తలేడు. అదే డీఏ ఇస్తే మా వల్లే.. అంతా మేమే అనేవాళ్లు.
- సీఎం స్వయంగా మంత్రివర్గంలో చర్చించి ఇస్తాం అని చెప్పిన తర్వాత కూడా ఇవ్వకపోవడం దగా చేయడమే.
- అన్నింటికీ డబ్బులుంటాయి. కానీ ఉద్యోగులకిచ్చేందుకు మాత్రం లేవు. విడ్డూరం.

తీవ్రంగా నిరాశపరిచారు

డీఏలపై ఎలాంటి ప్రకటన చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని తీవ్రంగా నిరాశపరిచింది. ప్రభుత్వ వైఖరి పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మంత్రి వర్గంలో చర్చించి ప్రకటిస్తామని ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టుకోలేకపోయారు. డీఏలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరాలోచించాలి. లోక్‌సభ ఎన్నికలకు ముందు సానుకూల ఆదేశాలివ్వాలి.

- కే లక్ష్మయ్య, పెన్షనర్స్ జేఏసీ చైర్మన్

'పది' పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యమైనా ఓకే

- ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోం
- 18 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం
- అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి : ఎస్సెస్సీ బోర్డు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతించాలని ఎస్సెస్సీ బోర్డు అధికారులు నిర్ణయించారు. ఆ తర్వాత వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షాకేంద్రాల్లోకి పంపించబోమని స్పష్టం చేసింది. విద్యార్థులు పరీక్షా సమయానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు. పదోతరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్సెస్సీబోర్డు అధికారులు పరీక్షల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సారి ప్రశ్నపత్రాలు తారుమారుకాకుండా ఉండేందుకు పటిష్ట చర్యలు చేపట్టారు. పేపర్‌కోడ్, సబ్జెక్టు, మీడియం తప్పుగా వచ్చినట్టయితే ఇన్విజిలేటర్లు వెంటనే చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులను (సీఎస్‌డీవో) సంప్రదించాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించినవారిపై 1997చట్టం 25 ప్రకారం క్రమశిక్షణాచర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

పొరపాట్లకు ఆస్కారమున్నచిక్కడే..

సహజంగా మొదటి భాష (తెలుగు) పరీక్ష రోజున ప్రశ్నపత్రాలు తారుమారయ్యే అవకాశం ఉన్నది. పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులకు 10టీ, 02టీ కోడ్ ఉన్న పేపర్లకు 80 మార్కుల పరీక్ష ఉంటుంది. అదేరోజు కాంపొజిట్ కోర్సు తెలుగు విద్యార్థులకు 60 మార్కులకు 03టీ కోడ్ పేపర్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ రెండు పేపర్ల పంపిణీ సమయంలో ఇన్విజిలేటర్లు గందరగోళానికి గురవుతున్నారు. తెలుగుతో పాటు ఊర్దూ విషయంలోనూ ఇదే తరహా గందరగోళం జరుగుతున్నది. దీనిని నివారించేందుకు కాంపోజిట్ ప్రశ్నపత్రాలను కలర్‌పేపర్‌పై ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది.



బీడీ మ్యానుఫాక్చరింగ్ కంపెనీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్‌భాయ్ ఉపాధ్యాయ్‌కు వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

బీడీ టేకేదారుల కమీషన్ పెంచాలి

బీడీ మ్యానుఫాక్చరింగ్ కంపెనీ అసోసియేషన్‌కు ఎల్ రూప్‌సింగ్ విజ్ఞప్తి

నిజామాబాద్, మార్చి 13: పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న టేకేదారులకు కమీషన్ పెంచాలని రాష్ట్ర బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్ రూప్‌సింగ్ విజ్ఞప్తి చేశారు. తక్కువ కూలి ఉండటంతో చాలామంది బీడీ కార్మికులు వృత్తి మానేస్తున్నారని, దీంతో ఉత్పత్తి తగ్గి టేకేదారులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బుధవారం నిజామాబాద్‌లో బీడీ మ్యానుఫాక్చరింగ్ కంపెనీ అసోసియేషన్ ప్రధాన అధ్యక్షుడు ప్రకాశ్‌భాయ్ ఉపాధ్యాయ్‌కు మెమోరాండం అందజేశారు. టేకేదారుల కమీషన్, కనీస వేతనం పెంచాలని కోరారు. ప్రమాద బీమా కల్పించి ఆదుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దుంపల నారాయణ, మంచె నర్సింహులు, రచ్చ ఆంజనేయులు, క్యాస మల్లారెడ్డి, బొమ్మకంటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక సర్కారు బడుల్లో ఆకస్మిక తనిఖీలు!

- వారంలో రెండు స్కూళ్ల పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్లను ఆదేశించనున్న ప్రభుత్వం
- విద్యాశాఖకు అందనున్న నివేదికలు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : ప్రైవేట్ స్కూళ్లకు 9 గంటలకే అంటే 9లోపు.. 10 గంటలకే అంటే 10 గంటలకే టీచర్లు వస్తారు. అదే సర్కారు బడులకు 9 అంటే 10 గంటలకు, 10 అంటే 11 గంటలకొచ్చేవాళ్లున్నారు. స్కూళ్లో ముగ్గురు టీచర్లుంటే వచ్చేది ఇద్దరే. ఇక షిఫ్టులు, వంతులు పెట్టుకొని ఒకరు స్కూళుకెళ్లి, మరొకరు డుమ్మాకొడుతున్న పరిస్థితులున్నాయి. కానీ జీతాలు మాత్రం పూర్తిగా తీసుకొంటారు. ఇది ప్రైవేట్‌కు.. సర్కారు బడులకున్న తేడా. ఈ విషయాలన్నీ నాకు తెలుసు. అన్నింటిపై నాకు స్పష్టమైన అవగాహన ఉన్నది. ఇక నుంచి ఇలాంటి వాటిని ఉపేక్షించం. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను (ఎఫ్ఆర్ఎస్) పటిష్టంగా అమలుచేయాలి. అన్నిశాఖలు, కార్యాలయాల్లో ఈ హాజరు అమలవుతుంది. సీఎం, సీఎస్ సహా ఐఏఎస్ అధికారులంతా ఎఫ్ఆర్ఎస్ హాజరును నమోదుచేయాలి. ఇటీవలే విద్యాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో అన్న మాటలివి (అధికార వర్గాల కథనం ప్రకారం). విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్న సీఎం ఇలా వ్యాఖ్యానించడంతో విద్యాశాఖ అప్రమత్తమైంది. సర్కారు బడులను గాడినపెట్టే పనిలో నిమగ్నమైంది.

కలెక్టర్ల చేత ఆకస్మిక తనిఖీలు

సర్కారు బడులను గాడిలో పెట్టడంలో భాగంగా జిల్లా కలెక్టర్ల చేత ఆకస్మిక తనిఖీలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారంలో రెండు చొప్పున బడులను తనిఖీచేసేలా త్వరలోనే ఆదేశాలివ్వనున్నది. ఈ ఆకస్మిక తనిఖీ పూర్తైన వ్రాత కలెక్టర్లు పూర్తిస్థాయి నివేదికను రూపొందించి అటు విద్యాశాఖకు.. ఇటు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది. సర్కారు బడులపై ప్రజల్లో సదాభిప్రాయంలేదని, ఇందుకు టీచర్లు ఓ కారణమని ప్రభుత్వం గుర్తించింది. గ్రామీణ ప్రాంతాల్లోని టీచర్లు విధులకు గైర్హాజరవుతున్నట్టుగా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆకస్మిక తనిఖీల ద్వారా బడులను బలోపేతం చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వమున్నది. కాగా, వచ్చే జూన్‌లోపు 'మన ఊరు -మన బడి' కార్యక్రమంలో చేపట్టిన స్కూళ్లే కాకుండా అన్ని స్కూళ్లలో సరిపడ నీటి వసతి, టాయిలెట్లు, తాగునీరు, బెంచీలు వంటి సౌకర్యాలను కల్పించాలని విద్యాశాఖ యోచిస్తున్నది.

గతంలో వ్యతిరేకించిన సంఘాలు

పాఠశాలల్లో టీచర్ల హాజరును పర్యవేక్షించేందుకు అమలు చేసిన ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్)ను హాజరు విధానాన్ని గతంలో పలు ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. టీచర్లపై పెత్తనమేంటని ప్రశ్నించాయి. ఈ విధానంపై టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో విద్యాశాఖ వెనక్కితగ్గింది. దీంతో అరకొరగానే ఎఫ్ఆర్ఎస్ అమలవుతున్నది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో పూర్తిస్థాయిలో ఎఫ్ఆర్ఎస్ అమలుకు విద్యాశాఖ సమాయత్తమవుతున్నది.

2017 పీఈటీ అభ్యర్థులకు ఊరట

నియామకాల వివాదంపై హైకోర్టు తుదితీర్పు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీ పోస్టుల భర్తీకి 2017లో చేపట్టిన నియామకాలపై అభ్యర్థులకు ఎట్టకేలకు ఊరట లభించింది. డీపీఎడ్, బీపీఎడ్ అభ్యర్థుల వివాదానికి ముగింపు పలుకుతూ హైకోర్టు తుది తీర్పును వెలువరించింది. 1 నుంచి 5వ తరగతి వరకు డీపీఎడ్ అభ్యర్థులు, 6 నుంచి 10వ తరగతి వరకు బీపీఎడ్ అభ్యర్థులు, 5 నుంచి 8వ తరగతి వరకు ఆ రెండు క్యాటగిరీల అభ్యర్థులు అర్హులని జస్టిస్ అభినవ్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం పేర్కొన్నది. తదనుగుణంగా నియామకాలు చేపట్టాలని ఆదేశించింది. 616 పీఈటీ పోస్టుల భరీకి 2017లో నోటిఫికేషన్‌ను జారీ చేసిన ప్రభుత్వం..తొలుత డీపీఎడ్ అభ్యర్థులే అర్హులని ప్రకటించింది. దీనిపై బీపీఎడ్ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం వారిని కూడా అర్హులుగా ప్రకటించింది. అనంతరం పరీక్షను నిర్వహించి 1,200 మంది అభ్యర్థులను ఎంపిక చేసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టింది. 600 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయ్యాక ఆ పోస్టులు తమకే చెందాలని డీపీఎడ్ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో నాటి నుంచి ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ పెండింగ్‌లో పడిపోయింది. తాజాగా హైకోర్టు ఈ వివాదానికి ముగింపు పలకడంతో 2017 పీఈటీ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీలతో సర్కార్ బడుల నిర్వహణ

- బాధ్యత అప్పగిస్తూ ప్రభుత్వ జీవో జారీ
- 'అమ్మ ఆదర్శ కమిటీ'ల ఏర్పాటుకు నిర్ణయం
- త్వరలో మార్గదర్శకాలు జారీ
- ఇక ఎస్ఎంసీలు రద్దు అయినట్టేనా?

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు బడుల నిర్వహణ బాధ్యతను స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు ప్రభుత్వం అప్పగించింది. ఇందుకు పాఠశాల స్థాయిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం బుధవారం జీవో–5 జారీ చేశారు. బడుల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య అందించేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలతో కూడిన విలేజ్ ఆర్గనైజేషన్స్, పట్టణ ప్రాంతాల్లోని ఏరియా లెవల్ ఫెడరేషన్స్‌కు బడుల నిర్వహణలో భాగస్వామ్యం కల్పిస్తారు. శానిటేషన్, యూనిఫారాలు, మధ్యాహ్నం భోజనం సహా మొత్తం 10 అంశాలను ఎంపిక చేసి వీటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలప్పగించారు. గ్రామ, ఏరియా ఫెడరేషన్ అధ్యక్షురాలు ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఉంటారు. సంబంధిత పాఠశాల హెచ్ఎం మెంబర్ కన్వీనర్ అండ్ కో–ఆర్డినేటర్‌గా ఉంటారు. ఈ కమిటీకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ త్వరలోనే జారీచేయనున్నది. తాజాగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుతో ఇప్పటివరకు పాఠశాల నిర్వహణను పర్యవేక్షించే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లు రద్దు కావడం ఖాయమని అధికారుల ద్వారా తెలిసింది. అయితే, దీనిపై మార్గదర్శకాల్లో పూర్తి స్పష్టత రానున్నది.

అప్పగించే పది అంశాలివే..

- బడుల్లో మౌలిక వసతులు కల్పించడం, బలోపేతం చేయడం.
- బాలికల టాయిలెట్ల నిర్మాణం
- తాగునీటి సౌకర్యం కల్పించడం
- పాఠశాలల్లో మేజర్, మైనర్ రిపేర్లుచేయడం
- టాయిలెట్లకు మరమ్మతులు చేయడం, నిర్వహించడం
- తరగతి గదుల్లో విద్యుద్దీకరణ చేపట్టడం
- పాఠశాల ప్రాంగణంలో శానిటేషన్, నిర్వహణ
- విద్యుత్తు బిల్లుల భారం తగ్గించేందుకు సోలార్ ప్యానళ్ల ఏర్పాటు
- పాఠశాల నిర్వహణ బాధ్యతలు
- యూనిఫారాలు కుట్టించడం

గాంధీలో పోస్టుల భర్తీకి 16న ఇంటర్వ్యూలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో వివిధ విభాగాలలో 121 పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్టు గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16న ఉ.9గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఇందులో ప్రొఫెసర్ పోస్టులు–3, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు –73, ట్యూటర్స్–8, సీనియర్ రెసిడెన్సీలు–37 పోస్టులను ఏడాది కాలానికి భర్తీ చేస్తామని వెల్లడించారు.

'అటానమస్' ఆగడాలకు కళ్లెం

- ప్రత్యేకంగా అటానమస్ కాలేజీ అఫైర్స్ విభాగం
- డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బీ రవీంద్రారెడ్డి

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : అటానమస్ హోదా పేరిట ఇష్టారీతిన నడుస్తున్న ఇంజినీరింగ్ కాలేజీలకు ముకుతాడు వేసేందుకు జేఎన్టీయూహెచ్ కీలక నిర్ణయం తీసుకొన్నది. ఇక అటానమస్ కాలేజీల పర్యవేక్షణకు ప్రత్యేకంగా డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ ఆటానమస్ కాలేజీ అఫైర్స్ పేరిట ప్రత్యేకంగా నూతన విభాగాన్ని నెలకొల్పింది. దీనికి డైరెక్టర్‌గా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గణితం డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ బీ. రవీంద్రారెడ్డిని నియమించింది. ఈ మేరకు జేఎన్టీయూ రిజిస్ట్రార్ కే వెంకటేశ్వర్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్‌కు ఆదరణ కరువు!

- ఇప్పటికీ కేవలం 2.70 లక్షల దరఖాస్తులు నమోదు
- ముందుకురాని నిరుద్యోగ అభ్యర్థులు
- నేటితో ముగియనున్న తుది గడువు
- పాత గ్రూప్-1కు 3.80 లక్షల అప్లికేషన్లు
- 5.50 లక్షల మంది పోటీపడతారని టీఎస్‌పీఎస్సీ భావన
- తలకిందులైన అందరి అంచనాలు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్–1 నోటిఫికేషన్‌కు నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఆదరణ తగ్గినట్టుగా కనిపిస్తున్నది. గత నెల 19న గ్రూప్–1 నోటిఫికేషన్ జారీ కాగా, అదే నెల 23 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించారు. ఈ నెల 14 వరకు దరఖాస్తుల తుది గడువుగా నిర్ణయించారు. అయితే, 13 వరకు (బుధవారం) 2.70 లక్షల మంది అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకొన్నారని టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. పాత గ్రూప్–1 నోటిఫికేషన్ ద్వారా 500 పోస్టులకు భారీగా 3.80 లక్షల దరఖాస్తులు నమోదైనట్టు గతంలో టీఎస్‌పీఎస్సీ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ లెక్కన ప్రస్తుతం గ్రూప్–1 ఉద్యోగాలకు పోటీపడేందుకు అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపుతలేరన్న విషయం తేటతెల్లమవుతుంది.

5.50 లక్షల దరఖాస్తులు వస్తాయని అంచనా..

ఇదిలావుండగా, కొత్త గ్రూప్–1 నోటిఫికేషన్‌లో మొత్తం 563 పోస్టులు భర్తీ చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో దాదాపు 5.50 లక్షల మంది అభ్యర్థులు పోటీ పడే అవకాశం ఉన్నదని టీఎస్‌పీఎస్సీ అధికారులు అంచనా వేశారు. కానీ, కేవలం 2.70 లక్షల దరఖాస్తులు మాత్రమే నమోదయ్యాయి. దరఖాస్తులకు గురువారం తుది గడువుగా ఉన్నది. ఒక్క రోజులో ఎంతలేదన్నప్పటికీ మరో 50 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చే అవకాశం ఉన్నది. ఈసారి గ్రూప్–1లో ఎక్కువ పోస్టులు ఉన్నాయి కాబట్టి ఎక్కువ మంది నిరుద్యోగులు కూడా దరఖాస్తు చేసుకొంటారని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భావించింది. వచ్చే లోకసభ ఎన్నికలలో నిరుద్యోగ అభ్యర్థులను కూడా ప్రసన్నం చేసుకోవచ్చని ఆశించింది. కానీ, అందరి అంచనాలు తలకిందులయ్యాయి.

మన ఘన చరిత్రను ముందు తరాలకి తెలియచేద్దాం

రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15

ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

అంజలి -సికింద్రాబాద్ 11.00,2.15,6.00,9.15
రాజధాని 70 -బిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
అర్జున్ 70 - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
SVC ఈశ్వర్ ఎ/సి - అత్తాపూర్ 11.00,6.00
ఇంద్రనాగేంద్ర కాంప్లెక్స్-కర్మన్‌ఘాట్ 2.45,9.30
శ్రీరాములు -మూసాపేట్ 11.30,2.30,6.30,9.30
లక్ష్మీకర సినీప్రైడ్ - మూసాపేట్ 11.30,2.15,6.15,9.30
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట్ 11.15,6.15,9.45
తాహ్యా